ప్రగతినగర్‌లో గాంధీ విగ్రహం ధ్వంసం

దుండిగల్, నవంబర్ 5 : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్‌లోని లేక్ వ్యూ కాలనీలో మంగళవారం గుర్తు తెలియని దుండగులు మహాత్మా గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. జాతిపిత విగ్రహం తలను వేరు చేసి దుశ్చర్యకు పాల్పడ్డారు. గాంధీజీ విగ్రహం ధ్వంసంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని మార్నింగ్ వాకర్స్ మద్ది నారాయణరెడ్డి, మధుసూధన్‌రెడ్డి, మహేశ్ గుప్తా, సామ్రాజ్యలక్ష్మి, గోపాలరాజు కోరారు. విషయం తెలుసుకున్న బాచుపల్లి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం తాగి విధులకు హాజరైన టీచర్

మోతె, నవంబర్ 5 : మద్యం తాగి విధులకు హాజరైన ఉపాధ్యాయుడు పాఠశాలలోనే నిద్రించాడు. ఈ దృశ్యం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మంగళవారం అతడిని సస్పెండ్ చేస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. సూర్యాపేట జిల్లా మోతె మండలం రామాపురం తండా ప్రాథమిక పాఠశాలలో ఎస్ ఉపేందర్ ఎస్‌జీటీగా పనిచేస్తున్నాడు. రోజూ మద్యం తాగి పాఠశాలకు ఇష్టానుసారంగా వస్తున్నాడని, తాగిన మైకంలో తరగతి గదిలో నిద్ర పోతున్నాడని గ్రామస్థులు చెబుతున్నారు. సోమవారం కూడా మద్యం తాగి విధులకు హాజరైన ఉపాధ్యాయుడు ఎస్ ఉపేందర్ గదిలో నిద్రపోగా స్థానికులు ఫొటోలు, వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయగా వైరల్ అయింది. స్పందించిన డీఈవో అశోక్ మంగళవారం అతడిని సస్పెండ్ చేశారు. గతంలోనూ ఇలాగే విధులకు హాజరై రెండుసార్లు సస్పెండ్ అయ్యాడు.

మహిళ గొంతు కోసిన గుర్తు తెలియని వ్యక్తి

కోదాడ రూరల్, నవంబర్ 5: గుర్తు తెలియని వ్యక్తి ఓ మహిళ గొంతు కోసి పరారయ్యాడు. ఈ ఘటన మంగళవారం సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణం నయానగర్‌లో చోటుచేసుకుంది. భర్తతో కలిసి నయానగర్‌లో ఓ వివాహిత నివా సం ఉంటున్నది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తి చొరబడి మహిళపై విచక్షణా రహితంగా దాడి చేశాడు. గొంతు కోసి పారిపోయాడు. బాధితురాలు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి రక్తపు మడుగులో ఉన్న ఆమెను చికిత్స నిమిత్తం కోదాడ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమయంగా ఉండటంతో సూర్యాపేట ఏరియా దవాఖానకు తరలించారు. నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్టు సమాచారం. ఈ విషయమై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఈఎన్సీ, సీఈకి షోకాజ్ నోటీసులు!

హైదరాబాద్, నవంబర్5 (నమస్తే తెలంగాణ): ఇటీవల మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు సమక్షంలో వాగ్వాదానికి దిగిన ఈఎన్సీ అనిల్ కుమార్, కొత్తగూడెం సీఈ శ్రీనివాస్ రెడ్డికి ప్రభుత్వం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. మంత్రుల ఎదుట ఎందుకు వాదనకు దిగాల్సి వచ్చిందనే వివరాలను మూడు రోజుల్లోగా చెప్పాలని ఆదేశించినట్టు తెలిసింది. ఇటీవల సీతారామ ఎత్తిపోతల పథకంపై మంత్రులు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పరిపాలన అనుమతులు లేకుండానే డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం, ఇతర పనులకు టెండర్లు ఆహ్వానించారనే అంశం చర్చకు వచ్చినట్టు సమాచారం. ఈ సందర్భంగా ఈఎన్సీ, సీఈ మధ్య వాగ్వాదం జరిగినట్టు ఇరిగేషన్ శాఖ వర్గాలు తెలిపాయి. మంత్రుల సమక్షంలోనే దురుసుగా ప్రవర్తించడంతో ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ మేరకు వారికి నోటీసులు జారీ చేసినట్టు సమాచారం.

'నాగారం' కేసులో మాజీ ఆర్డీవోకు ఈడీ సమన్లు

హైదరాబాద్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలోని నాగారం భూ వివాదం కేసులో మాజీ ఆర్డీవో వెంకటాచారికి ఈడీ అధికారులు సమన్లు జారీ చేశారు. మహేశ్వరంలోని నాగారం లో సర్వేనంబర్ 181లోని 42 ఎకరాల భూ కేటాయింపులపై ఇప్పటికే దర్యాప్తు చేస్తున్న ఈడీ అధికారులు వెంకటాచారికి శుక్రవారం విచారణకు హాజరుకావాలని కోరినట్టు సమాచారం.

హైదరాబాద్‌లోని గాంధీ ఐడియాలజీ సెంటర్‌లో కులగణనపై అభిప్రాయ సేకరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్, కాళ్లు మొక్కుతున్న దళిత ఎమ్మెల్యే మందుల సామేల్

దేశంలో అన్నిచోట్లా కుల వివక్ష

- రాజ్యాంగానికి పొంచి ఉన్న ముప్పు
- అగ్రవర్ణాల్లో కుల వివక్ష లేదు
- కులగణన అంటే మోదీకి భయం?
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కులగణన చేస్తాం.. రిజర్వేషన్లలో 50% నిబంధన ఎత్తేస్తాం
- కులగణనపై అభిప్రాయ సేకరణ సమావేశంలో రాహుల్‌గాంధీ

హైదరాబాద్, నవంబర్ 5(నమస్తే తెలంగాణ): దేశంలో అన్ని చోట్లా కుల వివక్ష ఉన్నదని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ ఆవేదన వ్యక్తంచేశారు. కుల వివక్షతో రాజ్యాంగానికి ముప్పు పొంచి ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. దేశంలో అసమానతలకు కుల వివక్ష కారణమని వివరించారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గాంధీ ఐడియాలజీ సెంటర్‌లో నిర్వహించిన కులగణనపై అభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మేధావులు, కుల సంఘాల నేతల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం రాహుల్‌గాంధీ మాట్లాడుతూ.. మన దేశంలో ఇంకా దళితుడిని అంటరానివాడిగా చూసే పరిస్థితి ఉన్నదని చెప్పారు. అయితే అగ్రవర్ణాల్లో మాత్రం కుల వివక్ష లేదని పేర్కొన్నారు. కులగణనను వ్యతిరేకిస్తున్న వారంతా కుల వివక్షకు అనుకులంగా ఉన్నట్టేనని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ ఎందుకు కులగణన చేయడం లేదని, ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే దేశవ్యాప్తంగా కులగణన చేస్తామని, రిజర్వేషన్లు 50 శాతానికి మించొద్దనే నిబంధనను ఎత్తేస్తామని హామీ ఇచ్చారు. ఈ నిబంధన వల్ల బలహీనవర్గాలకు అన్యాయం జరుగుతున్నదని తెలిపారు. కులగణన విషయంలో తెలంగాణ దేశానికి రోల్‌మాడల్‌గా ఉండాలని ఆకాంక్షించారు. బ్యూరోక్రటిక్ కులగణన చేయొద్దని, పేదల కోణంలో కులగణన జరగాలని సూచించారు. కులగణనలో కొన్ని పొరపాట్లు జరగొచ్చని, వాటిని సరి చేసుకుంటామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కులగణన పూర్తి చేసి బీసీలకు న్యాయంగా అందాల్సిన రిజర్వేషన్లు అందిస్తామని చెప్పారు. కులగణన చేపడతామని రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని నెరవేరుస్తున్నట్టు తెలిపారు. విద్య, వైద్యం, ఉద్యోగం, సామాజిక న్యాయం ప్రజలకు అందించాలనే ఉద్దేశంతోనే అడుగు ముందుకు వేశారని పేర్కొన్నారు.

నేడు రాడేల రాహుల్ ?

మొదటిపేజీ తరువాయి...

ఎదురుచూస్తుందన్నట్టుగా ఆ పార్టీ నాయకులు బిల్డప్ ఇచ్చారు. అభ్యర్థులు సైతం ఆ మాయలో పడి కాంగ్రెస్ నేతల డొల్ల మాటలు విశ్వసించారు. తాజా పర్యటన నేపథ్యంలో అశోక్‌నగర్‌కు ఒక్కసారి రావాలంటూ అభ్యర్థులు సోషల్ మీడియా వేదికగా కోరారు. ''రాహుల్ గాంధీ మీరు మాకిచ్చిన హామీలు నెరవేరలేదు. ఉద్యోగాల కోసం ప్రశ్నిస్తే మాపై లాఠీలు ఝుళిపిస్తున్నారు. మమ్మల్ని పోలీసులతో కొట్టించారు. తలలు పగలగొట్టించారు. జర మీరొచ్చి మా గోడు వినండి. మీరు మాకు ఇచ్చిన హామీలను ఈ రేవంత్ సర్కార్‌కు గుర్తు చేయండి.'' అంటూ అభ్యర్థులు సోషల్ మీడియా వేదికగా వేడుకొన్నారు. రాహుల్ పర్యటన నేపథ్యంలో అశోక్‌నగర్‌ను పోలీసులు చుట్టుముట్టారు. ఏ ఒక్క అభ్యర్థి రోడ్డు పైకి రాకుండా పోలీసులు నిర్బంధం విధించారు. నాడు తియ్యని కబుర్లు చెప్పి, ఉద్యోగాలేవని ప్రశ్నిస్తే ముఖం చాటేసిన రాహుల్ గాంధీ తీరుపై నిరుద్యోగులు మండిపడ్డారు.

నిరుడు అశోక్‌నగర్‌లో నిరుద్యోగులను కలిసి మాట్లాడుతున్న రాహుల్ (ఫైల్)

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ రాక కోసం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో నిరుద్యోగులు నిరీక్షించారు. రెండు గంటల పాటు ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని బావర్చి రెస్టారెంట్‌లో వేచిచూశారు. ఆయన రాకపోవడంతో తీవ్ర నిరాశతో వెనుదిగారు. కాంగ్రెస్ తమను నమ్మించి మోసం చేసిందని నిరుద్యోగులు వాపోయారు. త్వరలోనే తమ కార్యాచరణను ప్రకటించి, ఢిల్లీ వెళ్లి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రాహుల్ జీ.. అశోక్‌నగర్ రండి!

- 'శోక'నగర్‌గా మార్చిన ప్రభుత్వ తీరును చూడండి
- విద్యార్థులతో మాట్లాడి, వారి ఆవేదనను వినండి
- ఎక్స్‌లో రాహుల్‌కు మాజీమంత్రి హరీశ్‌రావు సూచన

హైదరాబాద్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ పర్యటనకు వచ్చిన రాహుల్‌గాంధీ అశోక్‌నగర్‌ను సందర్శించాలని మాజీ మంత్రి హరీశ్ రావు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 'శోక'నగర్‌గా మార్చిన తీరు చూడాలని, విద్యార్థులు, నిరుద్యోగుల ఆవేదన వినాలని మంగళవారం ఎక్స్ వేదికగా కోరారు. 'రాహుల్‌గాంధీజీ.. మీరు ఎన్నికల ముందు అశోక్‌నగర్‌లో నిరుద్యోగ యువతను కలిసిన ప్రదేశంలోనే, మీ సో-కాల్డ్ ప్రజాపాలన ప్రభుత్వం విద్యార్థులపై కర్కశంగా వ్యవహరించింది. లాఠీచార్జి చేసి వీపులు పగలగొట్టింది. ఈ దారుణాలు మీకు తెలుసా? మీరు వాగ్దానం చేసిన 2 లక్షల ఉద్యోగాల్లో కనీసం 10 శాతం ఉద్యోగ నోటిఫికేషన్లు కూడా ఇవ్వలేదు. టీఎస్పీఎస్సీని యూపీఎస్సీ తరహాలో ప్రక్షాళన చేస్తామని ప్రకటించారు. ప్రక్షాళన సంగతి దేవుడెరుగు, టీఎస్‌పీఎస్సీని టీజీపీఎస్‌గా పేరు మార్చి చేతులు దులుపుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పారు. కానీ, అది కేవలం జాబ్‌లెస్ క్యాలెండర్‌గా మిగిలిపోయింది. ఈ పది నెలల కాలంలో నిరుద్యోగ భృతి, రూ.5 లక్షల యువ వికాసం పథకం వంటి హామీల ఊసు కూడా లేదు. నిరుద్యోగులు, విద్యార్థులపై మీరు, మీ పార్టీ చూపిన కపటప్రేమ బట్టబయలైంది. కాంగ్రెస్ ప్రభుత్వ కర్కశ పాలనను నిరుద్యోగ యువత తప్పకుండా గుర్తుపెట్టుకుంటుంది' అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

ఫిరాయింపుదారులపై అనర్హత వేటుకు

గడువును నిర్దేశించే అధికారం కోర్టులకు లేదు

- హైకోర్టులో ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదన

హైదరాబాద్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): ప్రజాప్రతినిధుల పార్టీ ఫిరాయింపులపై కోర్టులు న్యాయ సమీక్ష జరిపేందుకు విధివిధానాలు ఉన్నాయని, బీఆర్‌ఎస్ తరఫున ఎన్నికల్లో గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి ఫి రాయించిన ఎమ్మెల్యేలపై అసెంబ్లీ స్పీకర్ నిర్ణయం తీసుకున్న తర్వాత మాత్రమే కోర్టులు న్యాయ సమీక్ష జరిపేందుకు వీలుంటుందని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి హైకోర్టులో వాదించారు. ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలన్న పిటిషన్లపై ఫలానా తేదీలోగా నిర్ణయం తీసుకోవాలని గడువు నిర్ణయించే అధికారం కోర్టులకు లేద ని స్పష్టం చేశారు. గతంలో ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ అసెంబ్లీ కార్యదర్శి వేసిన అప్పీల్ పిటిషన్‌పై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టడంతో ఏజీతోపాటు ఫిరాయింపు ఎమ్మెల్యే దానం నాగేందర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. ఈ వాదనలు బుధవారం కొనసాగనున్నాయి.

రాహుల్ రావాలని బావర్చి ఎదుట వినూత్న నిరసనకు దిగిన బీఆర్‌ఎస్ నేత సతీశ్‌రెడ్డి

రాహుల్ జీ.. బిర్యానీ వెయిటింగ్?

బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ హైదరాబాద్ పర్యటన సందర్భంగా బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి వినూత్న నిరసన ప్రకటించారు. రాహుల్ గాంధీ గత సంవత్సరం ఎన్నికల సమయంలో ఇదే నెల(నవంబర్ 25న) హైదరాబాద్‌కు వచ్చి అశోక్‌నగర్‌లో పర్యటించారు. ఆయన నిరుద్యోగులను కలిసి ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని పేర్కొన్న విషయాన్ని గుర్తు చేస్తూ.. వినూత్న నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ అశోక్‌నగర్‌లో పర్యటించి సంవత్సరం కావస్తున్నది, లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయి? నిరుద్యోగ భృతి ఎక్కడ పోయింది? తదితర విషయాలను అశోక్‌నగర్ వచ్చి బావర్చీలో బిర్యానీ తింటూ మాట్లాడుకునేవాళ్లం' అని పేర్కొన్నారు. తనతో కలిసి బిర్యానీ తినకపోయినా పర్వాలేదు కానీ, ఒకసారి నిరుద్యోగులను కలిసివెళ్లాలని కోరారు. ఆరు గ్యారెంటీలు ఎందాక వచ్చాయో తెలుసుకోవాలని సూచించారు. రైతు డిక్లరేషన్ ప్రకటించిన వరంగల్‌లోని ఎనుమాముల మార్కెట్‌కు వెళ్లి రైతులను కలువాలని కోరారు. ఎరువు లు, విత్తనాల కోసం ఇబ్బందులు, ధాన్యం కొనుగోళ్లు లేక అన్నదాతల అవస్థలను అడిగి తెలుసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు.. కేరళ, మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల పర్యటనలో బిజీబిజీగా ఉన్నారని, రా ష్ట్ర పర్యటనకు వస్తున్న రాహుల్‌గాంధీ అన్ని వర్గాల యోగక్షేమాలను తెలుసుకోవాలని సూచించారు.

నేటినుంచి కుల సర్వే

- 6 నుంచి 8 వరకు ఇండ్ల జాబితా
- 9 నుంచి కుటుంబ వివరాల నమోదు కార్యక్రమాలు
- సర్వే వివరాల సేకరణకు 30 రోజుల గడువు
- 80 వేల మంది ఎన్యూమరేటర్లను నియమించిన ప్రభుత్వం

హైదరాబాద్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా బుధవారం నుంచి కులగణన సర్వే ప్రారంభం కానున్నది. బుధవారం నుంచి శుక్రవారం వరకు మూడు రోజులపాటు ఇండ్ల జాబితా నమోదు (హౌస్‌లిస్టింగ్) కార్యక్రమం చేపడతారు. గ్రామ పంచాయతీ/మున్సిపాలిటీ పరిధిలోని గ్రామం (ఆవాసం) పేర్లను కోడ్‌రూపంలో, వార్డు నంబర్, ఇంటి నంబర్, వీధి పేరు కూడా నమోదు చేస్తారు. ఈ నెల 9 నుంచి ప్రభుత్వం ముద్రించిన ఫార్మాట్‌లో కుటుంబ వివరాలను ఎన్యూమరేటర్లు సేకరించి నమోదు చేస్తారు. 56 ప్రధాన ప్రశ్నలు, 19 అనుబంధ ప్రశ్నలు కలిపి మొత్తం 75 ప్రశ్నలకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. పార్ట్-1, పార్ట్-2 కింద 8 పేజీల్లో ఆయా వివరాలు పొందుపరుస్తారు. ఆధార్, ధరణి పాస్ బుక్, సెల్‌ఫోన్ నంబర్లు కూడా నమోదు చేసుకుంటారు. మొత్తం వివరాలు పూర్తి అయ్యాక, తాను చెప్పిన వివరాలన్నీ నిజమేనని ప్రకటిస్తున్నట్టుగా కుటుంబ యజమాని సంతకం తీసుకుంటారు. ఒక్కో కుటుంబం వివరాల నమోదుకు 10-20 నిమిషాలు పట్టే అవకాశం ఉన్నది. ఆధార్‌కార్డులు, ధరణి పాస్‌బుక్‌లు దగ్గర పెట్టుకుంటే ఎన్యూమరేటర్లు వచ్చినప్పుడు వివరాలు చెప్పడం సులభమవుతుంది. ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు సేకరించేందుకు ఎన్యూమరేటర్లకు 30 రోజుల గడువు కేటాయించారు. ఒక్కో ఎన్యూమరేటర్ 150 ఇండ్లను సందర్శించాలి.

ఎన్యూమరేటర్లుగా టీచర్లే అధికం

రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు 80 వేల మంది ఎన్యూమరేటర్లను ప్రభుత్వం నియమించింది. వీరిలో సగానికిపైగా టీచర్లు, కార్యదర్శులు, గ్రామస్థాయి సిబ్బంది ఉన్నారు. మండలస్థాయిలో సర్వే పర్యవేక్షణకు సుమారు ఎనిమిది వేల మందిని సూపర్‌వైజర్లుగా నియమించారు. నోడల్ ఆఫీసర్లుగా మరో 620 మందిని నియమించారు. జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో అదనపు కలెక్టర్ల పర్యవేక్షణలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పక్కాగా నిర్వహించనున్నట్టు రాష్ట్ర ప్రణాళిక, గణాంకశాఖ డైరెక్టర్ పీ రూఫస్‌దత్తమ్ తెలిపారు. వివరాలను మండలాల వారీగా కంప్యూటర్‌లో నమోదు చేస్తామని పేర్కొన్నారు.

కులమతాలు చెప్పకుంటే ప్రత్యేక కాలమ్స్!

- పిటిషనర్ల వినతులపై పరిశీలించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, నవంబర్ 5(నమస్తే తెలంగాణ): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా జనాభా సేకరణకు సంబంధించిన పత్రాల్లో కులం, మతం వెల్లడించేందుకు ఆసక్తి లేని వారి కోసం నో క్యాస్ట్, నో రిలిజియన్ కాలమ్‌ను ఏర్పాటు చేయాలనే పిటిషనర్ వినతిని ప్రభుత్వం పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. నో క్యాస్ట్ (ఎన్‌సీ), నో రిలిజియన్ (ఎన్ఆర్) కాలమ్స్ పెట్టాలన్న పిటిషనర్ అభ్యర్థనను పరిశీలించాలని సూచించింది. పిటిషనర్ వినతిపై ఏ నిర్ణయం తీసుకున్నారో తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద మంగళవారం ఆదేశించారు. రాజ్యాంగంలోని అధికరణ 25(1) ప్రకారం.. మనస్సాక్షికి నచ్చిన మతాన్ని అనుసరించే స్వేచ్ఛ పౌరులకు ఉన్నదని స్పష్టంచేశారు. కులం, మతం వెల్లడించని వారి వివరాలను ప్రత్యేకంగా సేకరించడానికి ఉన్న ఇబ్బందులేమిటో కూడా కౌంటర్ పిటిషన్ ద్వారా తెలియజేయాలని ఆదేశించారు. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ, సామాజిక సంక్షేమ శాఖ, వెనుకబడినవర్గాల సంక్షేమ శాఖల ముఖ్యకార్యదర్శులు, బీసీ కమిషన్లకు నోటీసులు జారీ చేశారు. వాదనల తర్వాత హైకోర్టు విచారణను డిసెంబర్ 4కి వాయిదా వేసింది.

నేటి నుంచి హాఫ్‌డే స్కూళ్లు

- కుల గణన సర్వే విధుల్లో టీచర్లు
- ఫలితంగా సగంపూటే నడవనున్న ప్రైమరీ స్కూళ్లు

హైదరాబాద్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలలు(ప్రైమరీ స్కూళ్లు) బుధవారం నుంచి సగంపూటే నడవనున్నాయి. ఈ స్కూళ్లను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకే నడుపుతారు. రాష్ట్రంలో కుల గణన బుధవారం నుంచి ప్రారంభంకానున్నది. సర్వే కోసం ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే సెండరీ గ్రేడ్ టీచర్లు, హెచ్‌ఎంల సేవలను వినియోగించుకుంటున్నారు. రాష్ట్రంలోని 18,241 ప్రాథమిక స్కూళ్లు సగంపూట మాత్రమే తెరుచుకోనున్నాయి. ఈనెల 30 వరకు సర్వే కొనసాగనుండగా, 80 వేల మంది సిబ్బందిని, ప్రభుత్వ ఉద్యోగులను ఈ సర్వే కోసం ప్రభుత్వం రంగంలోకి దించనుంది.

సర్వే నుంచి టీచర్లను మినహాయించాలి

- ప్రభుత్వ నిర్ణయం విద్యాహక్కు చట్టం ఉల్లంఘనే
- సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు బహిరంగ లేఖ

హైదరాబాద్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నుంచి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను మినహాయించాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. సర్వేకు ఉపాధ్యాయులను వినియోగించటం విద్యాహక్కుచట్టం ఉల్లంఘనేనని స్పష్టంచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 36,559 ఎస్జీటీలు, 3414 మంది ప్రధానోపాధ్యాయులను సర్వేలో భాగం చేస్తూ విద్యాశాఖ జారీ చేసిన ఉత్తర్వులు నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలపై ఉన్న నమ్మకం రేవంత్‌రెడ్డి పాలన పుణ్యమా అని రోజురోజుకీ దిగజారుతున్నదని, వాటికితోడు సీఎం నిర్లక్ష్యం, అనాలోచిత నిర్ణయాలతో విద్యార్థులు, తల్లిదండ్రులకు తోడు ఉపాధ్యాయులకు శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ సర్వే పేరుతో టీచర్లు, విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తూ, విద్యావ్యవస్థను సర్కార్ నిర్వీర్యం చేస్తున్నదని మండిపడ్డారు. ఉపాధ్యాయులను జనాభా గణన లెక్కలు, ప్రకృతి వైపరీత్యాల్లో సహాయ విధులు, పార్లమెంటు, రాష్ట్ర శాసనసభ, స్థానిక ప్రభుత్వాలకు జరిగే ఎన్నికలకు సంబంధించిన విధులకు మాత్రమే వినియోగించాలని విద్యాహక్కు చట్టం పేర్కొన్న విషయాన్ని హరీశ్‌రావు గుర్తుచేశారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జాక్ చైర్మన్ వెంకన్న, వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి, నేతలు

ఆర్టీసీ హామీల అమలుకు మహోద్యమం

- సర్కారు స్పందించకుంటే డిసెంబర్ 5న సచివాలయం ముట్టడి
- టీజీఎస్‌ఆర్టీసీ జాక్ చైర్మన్ వెంకన్న, వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 5(నమస్తేతెలంగాణ) : ఆర్టీసీలో ప్రైవేటు బస్సులను తగ్గించాలని, కొత్త బస్సులను కొనుగోలు చేసి ఉద్యోగులకు భద్రత, రక్షణ కల్పించి ఆర్టీసీ బలోపేతానికి చర్యలు చేపట్టాలని టీజీఎస్‌ఆర్టీసీ జాక్ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన నిరసనల్లో భాగంగా.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించి నిరసనలు తెలిపారు. హైదరాబాద్‌లో జాక్ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం థామస్‌రెడ్డి, కన్వీనర్ ఎండీ మౌలానా, కో-కన్వీనర్ల నేతృత్వంలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసేందుకు గెజిట్ విడుదలైనప్పటికీ అపాయింటెడ్ డేట్ ప్రకటించి జీవోను విడుదల చేయడంలో ప్రభుత్వం జాప్యం చేస్తున్నదని విమర్శించారు. ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరిస్తామని ప్రకటించినప్పటికీ దానిని అమలుచేయకుండా వెల్ఫేర్ బోర్డుల ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. మహాలక్ష్మి పథకానికి సంబంధించి ప్రతి నెలా రూ.350 కోట్లు విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకపోతే డిసెంబర్ 5న సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జాక్ కన్వీనర్ ఎండీ మౌలానా, కోకన్వీనర్లు యాదయ్య, సురేశ్, యాదగిరి, ఉద్యోగులు కమలాకర్‌గౌడ్, అహ్మద్, రాములు, ఆర్‌ఎన్ రెడ్డి, ధనుంజయ్, ఐలయ్య, సీకే రెడ్డి, రాఘవయ్య, మల్లయ్య, రవి, లక్ష్మయ్య, ఎల్‌ఎన్ గౌడ్, నాగరాజు, సురేందర్ పాల్గొన్నారు.

కొడంగల్ కాంగ్రెస్‌లో గెస్ట్‌హౌస్ రగడ

- పార్టీకి చెందిన నేత స్థలంలో కట్టేందుకు ఆర్‌అండ్‌బీ యత్నం
- భూమిపూజలో పాల్గొన్న ముఖ్యమంత్రి సోదరుడు
- తనను సంప్రదించకుండానే ఎలా కడతారని సీఎంకు సదరు నాయకుడి ఫిర్యాదు
- నారాయణపేటలో నిర్మించాల్సింది సీఎం ఇలాకాకు తరలింపు?

హైదరాబాద్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ) : సీఎం సొంత ఇలాకా అయిన కొడంగల్‌లో ఆర్‌అండ్‌బీ శాఖ నిర్మించ తలపెట్టిన గెస్ట్‌హౌస్.. కాంగ్రెస్‌లో చిచ్చు రాజేసింది. ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌ను ఓ కాంగ్రెస్ నాయకుడికి చెందిన ప్రైవేట్ స్థలంలో నిర్మిస్తుండటమే ఇందుకు కారణమైంది. భూసేకరణ పూర్తికాకుండానే ప్రైవేట్ స్థలంలో ఆర్‌అండ్‌బీ శాఖ గెస్ట్‌హౌస్ నిర్మాణం చేపట్టడం విమర్శలకు దారితీసింది. తన పట్టాభూమిలో గెస్ట్‌హౌస్ ఎలా కడతారని సదరు నాయకుడు ఇప్పటికే సీఎంకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.

ఒకటి ఉన్నా.. మరోటి

కొడంగల్‌లో ఇప్పటికే ఓ పురాతన ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఉన్నది. ఎవరైనా అధికారులు, వీఐపీలు వచ్చినప్పుడు అక్కడ ఉండేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఇప్పటి వరకు చెప్పుకోదగ్గ వీఐపీల రాక లేనందున ఇక్కడి అవసరాలకు గెస్ట్‌హౌస్ సరిపోతున్నది. కాగా, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఇక్కడ సువిశాల గెస్ట్‌హౌస్ నిర్మించాలని నిర్ణయించారు. దీనిని రూ.6.8 కోట్లతో నిర్మిస్తున్నట్టు అధికారవర్గాలు తెలిపాయి. అయితే స్థానిక కాంగ్రెస్ నాయకుడికి చెందిన ప్రైవేట్ స్థలంలో గెస్ట్‌హౌస్ నిర్మిస్తుండడం పార్టీలో వివాదానికి దారితీసింది. తనకు సమాచారం ఇవ్వకుండా, తనతో సంప్రదించకుండానే తన స్థలంలో ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఎలా నిర్మిస్తున్నారని సదరు నాయకుడు హైకమాండ్‌పై గుర్రుగా ఉన్నట్టు పార్టీ కార్యకర్తల్లో చర్చ నడుస్తున్నది. ఈ విషయమై ఆయన ఇటీవలే సీఎంకు ఫిర్యాదు చేయగా, తగిన చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చినట్టు సమాచారం. మరోవైపు, గెస్ట్‌హౌస్ భూమిపూజ కార్యక్రమంలో సీఎం సోదరుడు ప్రముఖంగా పాల్గొనడంతో సీఎం సూచనల మేరకే ఇది నిర్మిస్తున్నారనే చర్చ నడుస్తున్నది.

నారాయణపేటలో కట్టాల్సింది..

నారాయణపేటలో నిర్మించాలని ప్రతిపాదించిన గెస్ట్‌హౌస్‌ను కొడంగల్‌కు మార్చారని స్థానికంగా ప్రచారం జరుగుతున్నది. గతంలో నారాయణపేట్‌లో గెస్ట్‌హౌస్ నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు కాగా ప్రభుత్వం మారడంతో కార్యరూపం దాల్చలేదు. కొడంగల్‌లో ఇదివరకే ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఉండటంతో నారాయణపేటలో నిర్మించాలని గతంలో ప్రతిపాదించారు. ఇప్పుడు ఆ ప్రతిపాదనను రద్దుచేసి కొడంగల్‌లో నిర్మిస్తుండటం గమనార్హం. గెస్ట్‌హౌస్ లేనిచోట కట్టాల్సిందిపోయి ఉన్నచోటే మరో గెస్ట్‌హౌస్ కడుతుండటం విమర్శలకు తావిస్తున్నది. కొడంగల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులతోపాటు సీఎం సోదరుడు కార్యక్రమంలో పాల్గొనగా, కాంగ్రెస్ నేత ఈ కార్యక్రమానికి గైర్హాజరు కావడం చర్చనీయాంశమైంది. ఎలాంటి ప్రొటోకాల్ లేకుండా సీఎం సోదరుడు ఎలా పాల్గొంటారన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

భూసేకరణ పూర్తికాకుండానే..

గెస్ట్‌హౌస్ భూమి విషయంలో చర్చలు జరుగుతున్నాయని, సమస్య పరిష్కారమవుతుందని, నిర్మాణానికి ఢోకా లేదని అధికారులు చెప్తున్నారు. వాస్తవానికి ఈ గెస్ట్‌హౌస్ ప్రభుత్వ స్థలంలోనే చేపట్టాలి. ఒకవేళ ప్రభుత్వ స్థలం లేకుంటే ప్రైవేట్ వ్యక్తుల నుంచి సేకరించిన తరువాత నిర్మించాలి. కానీ, భూసేకరణ ప్రక్రియ పూర్తికాకుండానే ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రైవేట్ స్థలంలో గెస్ట్‌హౌస్ నిర్మాణానికి పూనుకోవడం వివాదాస్పదమైంది. సదరు భూమి కాంగ్రెస్ నాయకుడికి చెందినదని, ఒకవేళ భూ బదలాయింపు జరగకపోతే నిర్మాణం కో సం చేస్తున్న ఖర్చు వృథా అవుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి.

వీసీల ఎంపికలో ప్రభుత్వ పెత్తనం

జేఎన్టీయూ, జేఎన్‌ఏఎఫ్‌యూ వీసీ పోస్టులపై రగడ

హైదరాబాద్, నవంబర్5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని వర్సిటీల వైస్‌చాన్స్‌లర్ల ఎంపికలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నది. తాము అనుకున్న వారికి వీసీ పోస్టును కట్టబెట్టేందుకు ఎంతకైనా తెగిస్తున్నది. ఆఖరుకు అత్యంత కీలకమైన సెర్చ్ కమిటీని పెక్కనపెట్టి కొత్త సెర్చ్ కమిటీవేయబోతున్నది. ఇటీవలే రాష్ట్రంలోని 9 వర్సిటీలకు నూతన వీసీలను నియమించారు. జేఎన్టీయూ, జేఏఎన్‌ఎఫ్‌ఏయూ, బీఆర్ అంబేద్కర్ వర్సిటీల వీసీల ఎంపికకు బ్రేక్‌పడింది. దీంట్లో బీఆర్ అంబేద్కర్ మినహా మిగతా రెండింటిపై ప్రభుత్వం పట్టుదలకు పోతున్నట్టుగా వార్తలొస్తున్నాయి. జే ఎన్టీయూ, జేఏఎన్‌ఎఫ్‌ఏయూ జాబితాలో తమకు నచ్చని వారి పేర్లు ఉండటంతో గవర్నర్ ఆమోదానికి పంపించలేదని సమాచారం. వీరికి వీసీ పోస్టు ఇవ్వడం ఇష్టంలేకే ప్రభు త్వం సెర్చ్ కమిటీ సమావేశాలను ని ర్వహించడం లేదన్న ప్రచారం జరుగుతున్నది. అవసరమైతే సెర్చ్ కమిటీల ను రద్దు చేసి, మరో కమిటీ వేయాలని భావి స్తున్నట్టు తెలుస్తున్నది.